క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: మహిళలు నేటి సమాజంలో ధైర్యంగా ముందడుగు వేయాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఆగ్గాల విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా న్యాయసేవా సంస్థ నేతృత్వంలో ఇటీవల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం స్థానిక న్యాయస్థానంలో న్యాయమూర్తి బహుమతులు అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు


గ్రామదేవతకు పూజలు చేస్తున్న భక్తులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దిగువమండ గ్రామంలో గ్రామదేవత అంగరాడతల్లి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరిరోజు అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పరీక్షలంటే భయం వీడాలి


పదో తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈఓ ఎస్‌డీవీ రమణ

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డీవీ రమణ మంగళవారం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, ప్రశ్నలకు ఏవిధంగా జవాబులు రాయాలి, సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. భయాన్ని విడిచిపెట్టి ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాస్తే తప్పకుండా విజయం వరిస్తుందన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన


నిరసన తెలియజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

పాలకొండ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ ఉద్యోగులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నాలుగు రోజులుగా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని రెవెన్యూ సర్వీసుల సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు బి.బుచ్చయ్య తెలిపారు.

ప్రహరీ నిర్మాణానికి రూ.50 వేలు వితరణ


కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న డాక్టర్ ప్రసాద్‌లాల్

కురుపాం: మండల కేంద్రంలోని ముస్లింల శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి శివ్వన్నపేటకు చెందిన డాక్టర్ ప్రసాద్‌లాల్, కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని జామియా ముస్లిం కమిటీ సభ్యులు షేక్ గౌస్‌సాహెబ్, జిలానీ, నౌషద్, బకరి, రఫీలకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామన్నారు.

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు మంజూరు

సాలూరు: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రెండు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు మంజూరై కళాశాలకు చేరాయని ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఒక్కో వాటర్ ప్లాంట్‌కు సుమారు 5 లక్షల 20 వేల రుపాయిలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఒక్కో వాటర్ ప్లాంట్ ద్వారా 12 కుళాయిలు చొప్పున బాలురు, బాలికలకు మొత్తం 24 కుళాయిలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు
- మాస్‌కాపీకి అవకాశం లేకుండా సీసీ కెమెరాల ఏర్పాటు
- పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు



గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ జూనియర్ కాలేజీ పరీక్ష కేంద్రంలో బెంచీలపై విద్యార్థుల హాల్ టిక్కెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

వీరఘట్టం: ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల 15 నుంచి 29 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో గుర్తించిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని వసతులను అధికారులు సిద్ధం చేశారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాల నిఘాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో మొత్తం 289 మంది ఫస్టియర్, 257 మంది సెకండియర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపాల్ పి.శంకరరావు తెలిపారు.

- **సీతంపేట:** స్థానిక ఏపీఆర్ గిరిజన బాలురు, బాలికల జూనియర్ కళాశాలల్లో దాదాపు 800 మంది మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మల్లి సీఓఈ, కేజీబీవీ, అల్లూరి సీతారామరాజు ప్రైవేట్ కళాశాల, బాలురు, బాలికల కళాశాలల విద్యార్థులు ఈ రెండు కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. ప్రతీ గదిలో సీసీ కెమెరాలు అమర్చినట్లు చిఫ్ సూపరెంటెండెంట్లు పి.సూర్యకుమారి, విశ్వనాథం తెలిపారు.


వీరఘట్టం: జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

- **గుమ్మలక్ష్మీపురం:** మండల కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 1114 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కాలేజీ(పీటీజీ), ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఎస్టీ), భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ జూనియర్ కాలేజీ పరీక్ష కేంద్రాల్లో ఇప్పటికే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.
- **పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన స్టేట్‌అబ్జర్వర్**
  సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాల ఇంటర్మీడియెట్ పరీక్షల కేంద్రాన్ని స్టేట్ అబ్జర్వర్ ఉమామహేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. తరగతి గదుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, బెంచీలు, తాగునీరు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం బాలుర కళాశాలను సందర్శించారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

గరుగుబిల్లి: విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ బి.ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వారోత్సవాల్లో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పించడంతో పాటు వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎ.సింహాచలమమ్మ, కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు, జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి బి.హరిరామ్‌కుమార్, ఆర్.రాజ్యలక్ష్మి, బి.నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు సన్నద్ధం


రికార్డులు పరిశీలిస్తున్న ఉపాధి సిబ్బంది

భామిని: మండల పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్‌కు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందాలకు ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్లు మంగళవారం రికార్డులు అప్పగించారు. గత ఏడాదిగా చేపట్టిన పనులకు సంబంధించిన ఎం-బుక్‌లు, వేతనదారుల మస్తర్లు, బిల్లు చెల్లింపు వివరాల రికార్డులను అందజేశారు. ఏపీఓ తులసీదాస్ పర్యవేక్షణలో ఆడిట్ బృందాలు వాటిని పరిశీలిస్తున్నాయి.

నాగూరులో వైద్యశిబిరం


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుస్మిత దివ్య

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు గ్రామంలో అనిల్ నీరుకొండ ఆస్పత్రి(విశాఖపట్నం) సౌజన్యంతో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ కేతిరెడ్డి సుస్మిత దివ్య శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు స్థానిక సర్పంచ్ కె.శిరీష నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఈఈ కె.చంద్రశేఖరరావు, స్థానిక నాయకులు కె.కూర్మినాయుడు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

దంత సమస్యలపై అవగాహన అవసరం


బలిజిపేట పీహెచ్‌సీ నుంచి నిర్వహించిన ర్యాలీ


బలిజిపేట: దంతాల పరిరక్షణ ఎంతో అవసరమని బొబ్బిలి సీహెచ్‌సీ దంత వైద్యురాలు లోకముద్ర తెలిపారు. ప్రపంచ నోటిదినోత్సవం సందర్భంగా బలిజిపేట పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. దంత సమస్యలపై ప్రజలలో అపోహలు ఉన్నాయని వాటిని తొలగించుకోవాలని హితవు పలికారు. పళ్లు, దంతాలకు సంబంధించిన జాగ్రత్తలపై తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహీపాల్, కిరణ్మయి, సీహెచ్‌ఓ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

16న ఆలయ పునఃప్రతిష్ఠోత్సవం


పునర్నిర్మించిన కోటదుర్గమ్మ ఆలయం

వీరఘట్టం: మండలంలో కేంద్రంలోని కోటదుర్గమ్మ ఆలయాన్ని రూ.1.60 కోట్లతో పునర్నిర్మించారు. అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు ఆలయ పునఃప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నారు. ఏకశిలతో రూపొందించిన కోటదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు.

ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయాన్ని పునర్నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించారు. గ్రామస్తులతో పాటు దాతలు సహకారం అందించడంతో యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ నేతృత్వంలో నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు రూ.1.60 కోట్లతో ఆలయాన్ని అన్ని హంగులతో పునర్నిర్మించారు. గ్రామస్తులు, దాతల ఆధ్వర్యంలో ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించనున్నారు. ఈ నెల 19న భక్తులకు అన్నసమారాధన చేపట్టనున్నారు.


కోటదుర్గమ్మ ఉత్సవ విగ్రహం

మాతాశిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు


ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న డీఐఓ జగన్మోహనరావు

గరుగుబిల్లి: ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో చిన్నారుల వివరాలు, వ్యాక్సినేషన్ వివరాలు పక్కాగా నమోదు చేయాలని, అన్ని గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. రావివలస పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన 'ఆశా డే' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పీహెచ్‌సీ పరిధిలో అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలని సూచించారు. ప్రజారోగ్య సర్వేలను పక్కాగా చేపట్టాలన్నారు. ఆశా కార్యకర్తలు ఇ-ఆశా యాప్‌లో మాతా,శిశు ఆరోగ్య వివరాలను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కె.అరుణకుమారి, కె.కార్తీక్, సూపర్‌వైజర్స్ ఎస్‌ఎస్ ప్రకాష్, ఎం.సన్యాసమ్మ, జయగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- **సింగన్నవలసలో ఫ్యామిలీ డాక్టర్**
  పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సుమారు 85 మందికి అన్నవరం పీహెచ్‌సీ వైద్యులు వెన్నెల ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. వేసవిలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, ఏఎన్‌ఎం తేజ, ఆశా వర్కర్లు వైద్యసేవలందించారు.
- **ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**
  పాలకొండ రూరల్: 'డీవార్మింగ్ డే' సందర్భంగా 2 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసున్న విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని అన్నవరం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఎంపీపీ బొమ్మాళి భాను విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్, హెచ్‌ఎం బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే బుక్కూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. బహిరంగ మలవిసర్జన వల్ల కలిగే అనర్థాలను వివరించారు.
- **సీతంపేట:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డీవార్మింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.


పాలకొండ: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ వెన్నెల


పాలకొండ రూరల్: అన్నవరం పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ


పాలకొండ రూరల్: బుక్కూరు అంగన్‌వాడీలో పిల్లలచే చేతులు శుభ్రం చేయిస్తున్న కార్యకర్తలు

ప్రణాళికతో చదివితే విజయం మీదే..


గురుకుల విద్యార్థినులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

- సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

భామిని: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికతో శ్రమిస్తే గమ్యాన్ని చేరుకోవచ్చని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్ అన్నారు. భామినిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. అనంతరం వారితో ముచ్చటించారు. మారుమూల గ్రామంలోని పేదింటిలో పుట్టిన తాను ప్రభుత్వ పాఠశాలలోనే విద్యనభ్యసించానని, 26 ఏళ్లకే ఐఏఎస్ అయ్యానని వివరించారు. కుటుంబానికి దూరంగా.. గురుకులాల్లో ఉంటూ చదవడం ఎంత కష్టంగా ఉంటుందో తనకు తెలుసని, కానీ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే చిన్నచిన్న ఇబ్బందులు అధిగమించాలని అన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకుని, సూచనలు సలహాలు అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ బగాది జగన్నాథం మాట్లాడుతూ నియోజకవర్గంలోని 4 మండలాల్లో 51,786 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయాల్సి ఉందన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత కలుగుతుందని, దాన్ని నివారించేందుకు 2 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసున్న విద్యార్థులకు ప్రభుత్వం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోందన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయపార్వతి, వైద్యాధికారులు ఫణికుమార్, సోయల్, ప్రిన్సిపాల్ కె.విజయ నిర్మల, వైద్య సిబ్బంది ఉన్నారు.


విద్యార్థినులతో అల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్నాథం

ఆక్రమణల పరిశీలన


ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని గారమ్మ కాలనీలో స్థల వివాదం కొనసాగుతోంది. కాలనీలో సుమారు 25 సెంట్లు స్థలాన్ని కాలనీ అవసరాల కోసం కేటాయించారు. ఈ స్థలం ఆక్రమణకు గురవుతోందని స్థానికంగా ఉన్న కొంతమంది తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, సర్వేయర్ వెంకటరావు, డీటీ బుచ్చయ్య మంగళవారం స్థల పరిశీలన చేశారు. కాలనీతో పాటు ఈ స్థలం నగరపంచాయతీకి కేటాయించామని తహసీల్దార్ తెలిపారు. స్థలంలో ప్రస్తుతం ఎటువంటి ఆక్రమణలు లేవని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి


మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కురుపాం: మండలంలోని సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి అధికారులకు పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. సమావేశంలో కురుపాం జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, రంగారావు ఎంపీడీఓ వి.శివరామప్ప, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ నిధులతో ఆలయ నిర్మాణం


గుడి నిర్మాణానికి ప్లాన్ సిద్ధం చేస్తున్న ఈఈ వెంకటరమణ, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని పీఆర్.రాజుపేట గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పర్యవేక్షణలో తుంబాలమ్మ గుడి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ మేరకు టీటీడీ ప్లానింగ్ ఈఈ సీహెచ్.వెంకటరమణ మంగళవారం గ్రామంలో ఆలయ నిర్మాణానికి గుర్తించిన స్థలాన్ని పరిశీలించి నమూనా ప్లాన్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గుడి నిర్మాణానికి టీటీడీ రూ.10 లక్షలు మంజూరు చేసిందన్నారు. త్వరలో గ్రామస్తుల సహకారంతో బేస్‌మెంట్ పనులు, ఆపై దేవాదాయశాఖ సమన్వయంతో మిగిలిన పనులు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏఎంసీ డైరెక్టర్ నేరడిబిల్లి ప్రసాద్, కె.ప్రసాదరావు, కె.ప్రకాష్‌రావు, రామకృష్ణ తదితరులున్నారు.

దాతలు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కురుపాం: నియోజకవర్గ కేంద్రంలో సీపీఐ కార్యాలయం నిర్మాణానికి దాతలు సహకరించాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కుండంగి గరుగుబిల్లి సూరయ్య అధ్యక్షతన కొత్తకొండబారిడి గిరిజన గ్రామంలో మంగళవారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్న మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం, పాలేరు వ్యవస్థ రద్దు కోసం, అటవీ హక్కుల పరిరక్షణ కోసం సీపీఐ ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లాలో అనేక పోరాటాలు చేశామన్నారు. జిల్లాలోని కురుపాం నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యాలయ నిర్మాణం నిధులు లేక నిలిచిపోయిందని, నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు దాతలు సహకరించాలని కోరారు. సమావేశంలో పార్టీ సమితి సభ్యులు పువ్వల ప్రసాద్, మండంగి సింగన్న, పత్తిక మోహనరావు, లక్ష్మణరావు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: వలసలు నివారించేందుకు గ్రామస్థాయిలో అమలు చేస్తున్న ఉపాధి పనుల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. మండలంలోని గోపాపురంలో జరుగుతున్న అంపిలిబట్టి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పనులకు హాజరైన వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వృద్ధులు, దీర్ఘకాల ఆరోగ్య సమస్యలతో అవస్థలుపడుతున్న వారితో పనులు చేయించొద్దని సిబ్బందికి సూచించారు. క్షేత్ర సహాయకులు సమయపాలన పాటించాలని, నిర్దేశిత సమయాల్లో పనులు కచ్చితంగా జరిగేలా చూడాలన్నారు.

పట్టాలు మంజూరు చేయాలని వినతి


పట్టాలివ్వాలని కోరుతున్న మనుమకొండ ఆదివాసీ గిరిజనులు

భామిని: ఐదు దశాబ్దాలుగా తమ సాగు ఆధీనంలో ఉన్న అసైన్‌మెంట్ భూమికి పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలని మనుమకొండకు చెందిన ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు. ఈ మేరకు మాజీ సర్పంచ్, ఆదివాసీ నాయకుడు నిమ్మల అన్నయ్య ఆధ్వర్యంలో మంగళవారం అధికారులకు మొరపెట్టుకున్నారు. బత్తిలి సమీపంలో సర్వే నంబర్ 57-1లోని 14.96 ఎకరాల డీపట్టా భూమిని 1971 నుంచి తాము సాగు చేస్తున్నారని, దీన్ని అటవీ భూమిగా చూపుతూ పట్టాలు మంజూరు చేసేందుకు అధికారులు ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. దీన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు.